మమ్మేలు ఐలోని మల్లన్నా..

'ఐలోని మల్లన్న దండాలో.. సల్లంగ సూడు దండాలో' అంటూ భక్తులు చేసిన వేడుకోలుతో ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణంతా మార్మోగింది. సంక్రాంతి పర్వదినాన ఇక్కడ జరిగే జాతరకు వివిధ ప్రాంతాల నుంచి లక్షల్లో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాలు, శివసత్తుల పూనకాలతో ఎల్లమ్మ దేవతకు, మల్లికార్జునస్వామికి నైవేద్యం సమర్పించారు. సంక్రాంతి పర్వదినం రోజున అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు మీసాలు, వెండి కిరీటం, వెండి కవచం సుగంధాలు వెదజల్లే గజ పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. అనంతరం మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథాన్ని మార్నేని వంశీయులు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఇంటి ముందు అందంగా ముస్తాబు చేయగా కొబ్బరి కొట్టి ఆయన ప్రారంభించారు. మహానివేదనతో బయల్దేరిన రథానికి వాడవాడలా మహిళలు మంగళహారతులు, కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలుకగా ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. ఏటా మార్నేని వంశీయులు మల్లికార్జునస్వామికి పెద్ద బండిని కట్టి కొత్తగా పండించిన ధాన్యం, బండారి, కుంకుమ, బెల్లంతో కూడిన ప్రసాదాన్ని మార్నేని వంశీయులందరి ఇండ్ల నుంచి ఆనవాయితీగా వస్తున్నది. అనంతరం ఒంటిమామిడిపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం గ్రామాల నుంచి కూడా ప్రభబండ్లు కట్టి స్వామి వారికి మహానివేదనగా సమర్పించారు.


పుష్పయాగంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో దర్శనం కోసం పోటెత్తిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మకర సంక్రాంతిని పురస్కరించుకొని కొత్తకొండ వీరభద్రస్వామి, ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలకు భక్తజనం పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి సోమ, మంగళ వారాల్లో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో రెండు ఆలయాలు కిక్కిరిసిపోయాయి. స్వామి వారి దర్శనం కోసం బారులు తీరగా, కోరిన కోర్కెలు తీర్చాలని కోరమీసాలు సమర్పించుకున్నారు. కొత్తకొండలో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ వేలేరు యాదవుల మేకలబండ్లు, తీరొక్క పూలు, రంగులతో ముస్తాబైన కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ఆకట్టుకున్నాయి. అలాగే ఐనవోలులో మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో మహానివేదనతో పెద్ద బండి శోభాయాత్ర పురవీధుల్లో వైభవంగా సాగింది. నెత్తిన బోనాలు, కళాకారుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.
- భీమదేవరపల్లి/ఐనవోలు, జనవరి 16

ఐనవోలు: ఆలయం వద్దకు చేరుకున్న మార్నేని వంశీయుల పెద్దబండి


గుమ్మడి కాయతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

భక్తజన జాతర

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి

లక్షలాది మందితో పోటెత్తిన కొత్తకొండ, ఐనవోలు క్షేత్రాలు

కోరమీసాలు సమర్పించుకున్న భక్తులు.. ఆకట్టుకున్న కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు

వైభవంగా పెద్దబండి శోభా యాత్ర.. సంక్రాంతి వేళ సందడిగా ఆలయాలు

దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

కోరమీసాల స్వామికి కోటిదండాలు..

కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మకర సంక్రాంతి పర్వదినాన వేకువజాము నుంచే లక్షలాది మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించి తమ గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనె పోశారు. అనంతరం కోడె ప్రదక్షిణలు చేశారు. దర్శనం కోసం గంటల తరబడి క్యూకట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో శీఘ్రదర్శనం, వీఐపీ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా కనిపించాయి. సంక్రాంతి రోజున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, వొడితల సతీశ్ కుమార్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ బాబు, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, వరంగల్ జోన్ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ఉత్తరాయణ పుణ్యకాల పూజ నిర్వహించిన అనంతరం 108 లీటర్ల ఆవుపాలు, నవరసాలతో అభిషేకం, బిల్వదళార్చన మహాన్యాస పూర్వకంగా నిర్వహించారు. అనంతరం రుద్రయాగం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ, భక్తులకు విశేష దర్శనం జరిపించారు. యాగశాలలో జ్యోతిలింగార్చన పూజలు జరిగాయి. 365 దీపాలతో జ్యోతిలింగార్చన పూజలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వేలేరుకు చెందిన యాదవులు ఆలయం చుట్టూ డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ప్రదర్శించిన మేకలబండి ప్రదక్షిణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుట్టపైన కొలువుదీరిన వీరభద్రస్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు ఇంటి నుంచి కొత్తకొండకు ఎడ్లబండి రథం వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది సైతం ఎడ్లబండి రథాన్ని అందంగా అలంకరించగా గ్రామస్తుల సమక్షంలో శివసత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్లబండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు సాగనంపారు. కార్యక్రమంలో పీవీ సోదరుని కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే ఈ ఏడాది సైతం సుమారు 58వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలకంరించి రథాలుగా తీర్చిదిద్దారు. కొత్తపల్లి నుంచి కొత్తకొండ వరకు సాగిన ఎడ్లబండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లింలు ఎడ్లబండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఆలయంలో ములుకనూరు ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భక్తులకు సేవలందించారు. భక్తులకు ఆలయ ఈవో కిషన్‌రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. జాతరలో భక్తుల సౌకర్యాలు, పారిశుధ్యంపై అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. వేకువజాము నుంచే పారిశుధ్య కార్మికులు నిరంతరాయం సేవలందించారు. ప్రతి షాపు ఎదుట నిర్వాహకులు చెత్తబుట్టలు స్వతహాగా ఏర్పాటు చేసుకోగా ఎప్పటికప్పుడు కార్మికులు ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. దుమ్ము లేవకుండా రోడ్లపై ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించారు. 139మంది పారిశుధ్య కార్మికులు, 36మంది పంచాయతీ సెక్రటరీలు షిఫ్ట్‌వైజ్‌గా పనులు చేపట్టారు. ఎంపీడీవో భాస్కర్ సూచనలు చేయగా ఎంపీవోలు రవి, నాగరాజు మానిటరింగ్ చేశారు.భక్తుల సౌకర్యార్థం ములుకనూరు పీహెచ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటులో సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, గుడుంబా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. అడుగడుగునా నిఘా నేత్రాలను ఏర్పాటు చేసి అల్లరిమూకలకు చెక్ పెట్టారు.

కొత్తకొండ జాతరకు వస్తున్న ఎడ్లబండ్ల రథాలు

రెండు టికెట్లపై 20మందికి దర్శనమా?

ఐనవోలులో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి వీవీఐపీ టికెట్ తీసుకొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అయితే వీవీఐపీలు దర్శనానికి ప్రత్యేక టికెట్ తీసుకొని దర్శనానికి వెళ్లే పద్ధతిని ఈ జాతరలో కొత్తగా అమలులోకి తెచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎంపీలు ఇద్దరు టికెట్లు కొనుగోలు చేశారు కానీ వారి వెంట ఉత్సవ కమిటీ సభ్యులు కాకుండా సుమారు 20మందికి పైగా ఉన్నారు. వీవీఐపీ టికెట్ పేరుతో కొత్త పద్ధతిని అమలు చేసిన ప్రజాప్రతినిధులే ఈ పద్ధతిని సరిగా పాటించపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్ష నాయకులకు ఒక న్యాయం, ప్రతిపక్ష నాయకులకు మరో న్యాయమా అని ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజులు గడుస్తున్నా..

మొదలు కాని చలివాగు ప్రాజెక్టు మరమ్మతులు

క్రాప్ హాలీడేకు నెల క్రితం తీర్మానం

కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన రూ.10.21కోట్లు

శాయంపేట, జనవరి 16 : చలివాగు ప్రాజెక్టు మరమ్మతులకు తీర్మానం చేసి నెల రోజులు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో ప్రధాన జలవనరైన చలివాగు ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10.21కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్ట్ అగ్రిమెంట్ ప్రకారం తొమ్మిది నెలల్లోనే పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఆయకట్టులో క్రాప్ హాలీడే ప్రకటించారు. రైతులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇరిగేషన్ అధికారులు ఈ యాసంగి సీజన్‌లో పంటలు వేయొద్దని గత ఏడాది డిసెంబర్ 16న చలివాగు కట్టపై తీర్మానించారు. ఈమేరకు రైతులు పంటలను వేయలేదు. కానీ ఇప్పటివరకు నెల రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్ మరమ్మతులు ఇంకా ప్రారంభించలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బహుళ ప్రయోజక ప్రాజెక్టు

చలివాగు కింద ఏటా యాసంగికి 1400 నుంచి 1800 ఎకరాల వరకు తైబందీ ఖరారు చేస్తారు. చలివాగు ప్రాజెక్టు నిర్మించి 60 ఏండ్లు కావడంతో కాల్వలు, లైనింగ్, తూము, కట్ట దెబ్బతిన్నాయి. ప్రాజెక్టులో సిల్ట్ చేరింది. దీంతో పూర్తి మరమ్మతులకు గత ప్రభుత్వం రూ.10.21కోట్లను కేటాయించింది. చలివాగు జలాశయం పరకాల, రేగొండ, శాయంపేట, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల పరిధి గ్రామాల రైతులకు జీవధారగా ఉంది. చలివాగులోకి నీళ్లు వస్తే చిట్యాల వరకు పొలాల రైతులకు అందుతాయి. ఈ జలాశయం కింద 5వేల ఎకరాలకుపైగా సాగవుతుంది. చలివాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వ 10 కిలోమీటర్లు కొప్పుల, దమ్మన్నపేట, చెన్నాపూర్ వరకు ఉండగా దీని కింద 124ఎకరాల ఆయకట్టున్నది. కుడి కాల్వ 14 కిలోమీటర్లు ఉండగా దీని కింద 2,185 ఎకరాలు, ఎడమ కాల్వ కింద నాలుగు కిలోమీటర్లు ఉండగా 737 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రాజెక్టు 24 అడుగుల (500 ఎంసీఎఫ్‌టీ) నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. హనుమకొండ జిల్లాలోని పరకాల నియోజకవర్గ పరిధిలో 125 గ్రామాలు, శాయంపేటలోని 25 గ్రామాలకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా తాగు, సాగునీటికే కాకుండా వరంగల్ జిల్లా మెగా టెక్స్‌టైల్ పార్కుకు కూడా నీటి అవసరాలకు తరలించనున్నారు. బహుళ అవసరాల కోసం చలివాగు జలాశయం కీలకంగా ఉన్న నేపథ్యంలో మరమ్మతులు వేగంగా చేయాల్సి ఉన్నది. వేసవిలోగా ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయితే వానకాలం సీజన్‌కు సాగునీరు అందించవచ్చు. కాంట్రాక్టర్ తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని అగ్రిమెంట్ జరిగిందని, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు రావాలని కాంట్రాక్టర్ చూస్తున్నారని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభిస్తామని డీఈ గిరిధర్ వెల్లడించారు.

దెబ్బతిని ఊడిపోయిన చలివాగు ప్రధాన కాల్వ లైనింగ్

వరంగల్ ఉర్సుగుట్ట ఏరియాలోని రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

బినామీ డీలర్ల గుర్తింపునకు చర్యలు

- **వరంగల్ ఉర్సుగుట్టలో తనిఖీలు ప్రారంభం**
- **నిర్వహణకు 13 బృందాల ఏర్పాటు**

వరంగల్, జనవరి 16 (నమస్తేతెలంగాణ): బినామీ డీలర్లను గుర్తించేందుకు అధికారులు రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా రేషన్ షాపులో ఆర్డీవో జారీ చేసిన ఆధరైజేషన్ కాపీ, ఈ-పాస్ యంత్రంలోని పేర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డీలర్లలో బినామీలు ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తనిఖీలకు ఆదేశించింది. ఈ మేరకు వరంగల్ జిల్లాలో ఉన్న 509 రేషన్ దుకాణాల్లో తనిఖీల నిర్వహణకు తాజాగా కలెక్టర్ ప్రావీణ్య 13 బృందాలను ఏర్పాటుచేశారు. తహసీల్దార్లతో పాటు ఏసీఎస్‌ఓలు, డీటీసీఎస్‌లు, యూడీఆర్‌ఐలు ఇందులో ఉన్నారు. ఆయా మండలంలోని తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలోని క్షేత్రస్థాయి సిబ్బంది విధిగా తనిఖీల్లో పాల్గొనేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో జిల్లాలో మంగళవారం అధికారులు తనిఖీలు ప్రారంభించారు. తొలిరోజు ఉర్సుగుట్టలోని రేషన్ షాపుల్లో తనిఖీలు చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్‌తో పాటు ఏసీఎస్‌వో ఇందులో పాల్గొన్నారు. ఇలా జిల్లాలోని ప్రతి దుకాణాన్ని తనిఖీ చేస్తామని, ఎక్కడైనా బినామీ డీలర్ ఉన్నట్లు రుజువైతే సదరు వ్యక్తిపై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని చందన్ కుమార్ వెల్లడించారు. అలాగే బియ్యం నాణ్యతను పరిశీలించి, నాణ్యమైనవి సరఫరా చేయకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీ నివేదికలను ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. తనిఖీ సమయంలో దుకాణంలో ఒరిజినల్ డీలర్ మాత్రమే దుకాణం నిర్వహించాలని, రికార్డుల ప్రకారం నిల్వలు ఉండాలని, ఈ-కేవైసీ డేటాను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు చందన్‌కుమార్ చెప్పారు. ప్రతి డీలర్ తమ దుకాణం వివరాలు, జిల్లా పౌరసరఫరాల అధికారి, సంబంధిత తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్(సివిల్ సప్లయ్) మొబైల్ నంబర్లతో కూడిన బోర్డు, టోల్‌ఫ్రీ నంబర్ 1937 వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించి, ఆధరైజేషన్ కాపీ, ధరల పట్టికను కూడా ఏర్పాటు చేయాలని, తుకానికి లీగల్ మెట్రాలజీ స్టాంప్ ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- 'దళితబంధు' అకౌంట్ల ఫ్రీజింగ్ ఎత్తివేయాలి
- ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాటలు నమ్మే పరిస్థితి లేదు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోదీ ఎస్సీ వర్గీకరణ డ్రామా
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి

హనుమకొండ, జనవరి 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ తక్షణమే సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ, దళితబంధు అమలుపై వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో కలిసి మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ విషయంలో మాదిగ దండోరా ఆధ్వర్యంలో 30 ఏండ్లుగా ఆందోళనలు కొనసాగుతుండగా, మొదటినుంచీ బీఆర్ఎస్ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని మాజీ సీఎం కేసీఆర్, తాను కలిసి వెళ్లి కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు. ఎమ్మార్పీఎస్ కొన్నేళ్లుగా ఉద్యమం చేపట్టి నాటి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలు సైతం ఎస్సీ వర్గీకణను సమర్థించి శాసనసభల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసి కేంద్రానికి పంపగా రాష్ట్రపతి ఆమోదంతో 2000 నుంచి 2004 సంవత్సరం వరకు అమలు చేస్తే కొందరు వ్యతిరేకించారని తెలిపారు. సుప్రీంకోర్టును ఆశ్రయించగా వర్గీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో లేదని, పార్లమెంట్ ఆమోదంతో చేయాలని అభిప్రాయపడిందన్నారు. 2021లో పంజాబ్‌లో ఓ కేసులో ఐదుగురు సభ్యుల ధర్మాసనం వర్గీకరణను సుప్రీంకోర్టుకు బదిలీ చేసిందని, ఇందుకు ఏడుగురు సభ్యులు ఉండే లార్జ్ బెంచ్‌ను నియమించారని తెలిపారు. ఈ బెంచ్ ఈ నెల 17నుంచి విచారణ చేపట్టాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు తెలిసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న దృష్ట్యా ప్రభుత్వాలు అఫిడవిట్ దాఖలు చేస్తే వర్గీకరణకు అనుకూలంగా ఫలితాలు వచ్చే అవకాశం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులకు వెనుకాడకుండా పేరున్న అడ్వకేట్లతో వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందనే నమ్మకం లేదని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దళిత, దళిత ఉపకులాల ఓట్ల కోసమే ఆ పార్టీ నేతలు ఎస్సీ వర్గీకరణ అంటున్నారని ఆరోపించారు. గతంలో అనేక మార్లు హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం దళితులను మోసం చేసిందన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణలో దళితులకు ఆర్థిక చేయూత అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దళితబంధు పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున ఎంపిక చేసి ఒక్కొక్కరి ఖాతాలో రూ.9.90లక్షలు జమ చేయగా, వీటిలో కొందరు అవసరం మేరకు డబ్బులు తీసుకోగా, మిగతా డబ్బు వారి ఖాతాల్లో మిగిలిందన్నారు. ఎన్నికల కోడ్‌తో డబ్బులు డ్రా చేయలేదని, బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని, తద్వారా 11వేల మందికి సంబంధించి రూ.436కోట్లు బ్యాంకుల్లో ఉన్నాయన్నారు. బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని కొనసాగిస్తుందా లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రతి లబ్ధిదారుకు రూ.12లక్షలు అందిస్తామని పొందుపరిచిందని, పేరు మార్పుతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, నిరుపేద దళితులకు న్యాయం జరగాలని స్పష్టం చేశారు. 2వ విడతలో కలెక్టర్ల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు దళితబంధు పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఓట్లు వేసిన దళితుల నోట్లో కాంగ్రెస్ పార్టీ మట్టికొట్టిందన్నారు.